అబ్బురం..అపురూపం

దశాబ్దాల వయసు.. నేలకు దిగిన ఊడలు.. మెలితిరిగిన కాండం.. భారీగా పెరిగే వృక్షం చిన్న కుండీలో కనిపిస్తే.. అడుగు ఎత్తులోనే బోన్సాయ్ చెట్టు దర్శనమిస్తే.. అబ్బురపరిచేలా రాజసం ఒలకబోస్తుంటే చూసేందుకు రెండు కళ్లూ సరిపోవు. నేటి ఆధునిక సమాజంలో ఇలాంటి మరుగుజ్జు వృక్షాలకు డిమాండ్ పెరిగింది. నగరంలో పలువురు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మరీ ఈ మొక్కలు పెంచుకుంటున్నారు. ఇంటి అలంకరణలో వినియోగించడం స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. స్వప్నసౌధానికి సరికొత్త అందాలు తీసుకువచ్చే బోన్సాయ్ వైపు తిరుపతి వాసులు అధికంగా దృష్టి సారిస్తున్నారు.


వివిధ ఆకృతుల్లో కనువిందు చేస్తున్న బోన్సాయ్ మొక్కలు

- బోన్సాయ్ మొక్కలకు పెరుగుతున్న డిమాండ్
- ప్రత్యేక శ్రద్ధతో పెంచుకుంటున్న మహిళలు
- వివిధ రకాలను విక్రయిస్తున్న నర్సరీలు
- పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు

తిరుపతి మంగళం : బోన్సాయ్ మొక్కలను పలువురు ఇష్టంగా పెంచుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యావంతులైన గృహిణులు ఇంట్లో ఈ మొక్కల పెంపకాన్ని వ్యాపకంగా చేసుకుంటున్నారు. వీటిని అపురూపంగా సంరక్షించుకుంటున్నారు. ఈ క్రమంలోనే బోన్సాయ్ మొక్కలను రూ.వేల నుంచి రూ.లక్షలు వెచ్చించి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లో పెంపు జంతువును పెంచుకునేంత శ్రద్ధగా ఈ మొక్కలను చూసుకుంటున్నారు. ఈ మేరకు అగ్రికల్చర్, హార్టికల్చర్ సొసైటీ నిపుణులు సైతం తరచూ సదస్సులు నిర్వహించి బోన్సాయ్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు.

అత్యంత జాగ్రత్త అవసరం

బోన్సాయ్ మొక్కలు పెంచడం అంత సులువైన పనేం కాదు. అత్యంత జాగ్రత్తలు తీసుకుంటేనే కాపాడుకోగలం. ఏ ప్రదేశంలో ఉండాలి, వారానికి ఎన్నిసార్లు నీరందించాలి. ఎలాంటి ఎరువులు వాడాలి. ఇలా అనేక అంశాలపై కచ్చితమైన అవగాహన ఉండాలి.

విశిష్ట బహుమతులు

సాధారణంగా పెళ్లిళ్లు, ఫంక్షన్లు తదితర కార్యక్రమాలకు వెళ్లినప్పుడు ఏదో ఒక గిఫ్ట్ లేదా పూల బొకే తీసుకెళుతుంటాం. అయితే ప్రస్తుతం బోన్సాయ్ మొక్కలను బహుమతులుగా అందజేయడం రివాజుగా మారింది. ఈ మొక్కలను అందుకున్న వారు కూడా అపురూపంగా పెంచుకుంటున్నారు. దీంతో నగరంలోని చాలా నర్సరీల్లో బోన్సాయ్ మొక్కలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

మట్టి ప్రధానం

బోన్సాయ్ మొక్కల పెంపకానికి మట్టి, నీరు చాలా ప్రధానం. స్థానిక జాతి మొక్కలను బోన్సాయ్ మొక్కలుగా మలచడం కాస్త సులువు. కాకపోతే జాగ్రతలు తీసుకోవాల్సి ఉంటుంది. మా ఇంట్లో దాదాపు పది రకాల బోన్సాయ్ మొక్కలు ఉన్నాయి. ఫైకస్ మొక్కలు పెంచడం చాలా ఈజీ. వర్మీ కంపోస్టు వాడితే మంచిది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మొక్కల పెంపకంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.


– కుమారి, తిరుపతి

పెంపకానికి సూచనలు ఇవీ..

- బోన్సాయ్ మొక్కలకు ఎండ నేరుగా తగిలేలా ఉండకూడదు. అప్పుడప్పుడూ సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో మొక్కను ఉంచితే మంచిది.
- ఎప్పటికప్పుడు మొక్క చుట్టూ ఉన్న మట్టిని గమనిస్తుండాలి. ఏమాత్రం ఎండినట్టు కనిపించినా వెంటనే నీరు అందించాలి. అయితే ఎక్కువ నీరు పోసినా వేళ్లు కుళ్లిపోయే ప్రమాదముంది. కేవలం మధ్యాహ్నం, సాయంత్ర వేళల్లోనే నీరు పెట్టాలి.
- సాధారణంగా ప్రతి 45 రోజులకు ఒకసారి ఎరువులు వాడాలి. అయితే వేసవిలో మాత్రం 20 రోజులకు ఒక పర్యాయం వాడితే మంచిది.
- బోన్సాయ్ మొక్కలకు తేమ అత్యంత కీలకం. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలా రకాల బోన్సాయ్ మొక్కల జాతులకు 40శాతం నుంచి 70శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. అంతకన్నా తక్కువగా ఉంటే ఆకులు ఎండిపోతాయి.
- మొక్కలను తరచూ కుండీలు మారుస్తుండాలి. ఒకే రకమైన మట్టిలో ఎక్కువ కాలం ఉంటే పోషకాలు అందకుండా పోయే ప్రమాదం ఉంది. అదే కుండీలు మారిస్తే కొత్తరకం పోషకాలు మొక్కకు అందుతాయి.
- బోన్సాయ్ మొక్కను వేరే చోటుకు తరలించేప్పుడు గోనె సంచిని తడిపి వేర్లను మట్టితో కప్పి తీసుకెళ్లాలి.
- దెబ్బతిన్న కొమ్మలను ఎప్పటికప్పుడు కట్ చేస్తుండాలి. అలాగే ఏదైనా కొమ్మ ఎక్కువగా పెరుగుతుంటే కూడా కట్ చేసి నియంత్రించాలి.








నగరవాసులు తమ ఇళ్లు, కార్యాలయాల వద్ద ఇష్టంగా పెంచుకుంటున్న బోన్సాయ్ మొక్కలు

క్లుప్తంగా

భూమనకు ఘన సత్కారం


కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని పార్టీ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు మన్నెం ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా యుగంధర్, ఏపీ వీహెచ్‌ఎస్ కార్యదర్శి ముని, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు నరేష్, కిషోర్, సాయి, బోస్ ప్రణదీప్, సంపత్, లిఖిత, పవన్, వరుణ్, నరేంద్ర, వెంగయ్య, మధు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి వినతి

తిరుపతి రూరల్ : మురుగు సమస్య పరిష్కరించాలని తిరుచానూరు శ్రీపురి లేఅవుట్ వాసులు కోరారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి మురుగు నీటి కాలువను కొందరు ఆక్రమించారన్నారు. దీంతో మురుగు తమ లేఅవుట్‌లోకి చేరుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే కాలును పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

లాభసాటి సేద్యంపై అవగాహన


క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

భాకరాపేట : లాభసాటి సేద్యంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారి ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం మండలంలోని కమలయ్యగారిపల్లె, ఉదయమాణిక్యం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, మామిడి, బీర, కాకర పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మైక్రో ఇరిగేషన్ జిల్లా అధికారి సతీష్ మాట్లాడుతూ రైతులకు 90 శాతం సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాలు అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణకాంత్, రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయికృష్ణ, భానుప్రకాష్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

తిరుపతి కల్చరల్ : ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మంగళవారం మంగళం పంచాయతీ తిరుమల నగర్‌లో ఉపాధి పనుల కింద డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.391.60లక్షల ఉపాధి నిధుల్లో 60శాతం వెచ్చించి మంగళంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, సర్పంచులు బడి సుధాయాదవ్, వకుల, టీఎన్‌టీయూసీ నేత మధు, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీ, నేతలు ఈశ్వరయ్య, గోవిందరాజులు, చెన్నరాయప్ప పాల్గొన్నారు.

అలిపిరి బస్టాండ్‌లో ఆయుధ పూజ

తిరుపతి అర్బన్ : అలిపిరి ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. బస్సులు, విడి భాగాలను శుభ్రం చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, డీఎం హరిబాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న పీసీ రాయులు

తిరుపతి కల్చరల్ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పుట్టినరోజును పురస్కరించుకుని కస్తూర్బా గాంధీ ట్రస్ట్ చైర్మన్ పీసీ రాయులు ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. రాయులు మాట్లాడుతూ దేశానికి అమిత్‌షా అందిస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆర్.మునిరత్నం, బండి మధుసూదన్‌రెడ్డి, ఎం.ఉమాపతి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 64,894 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,355 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.82 కోట్ల ఆదాయ వచ్చింది. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

హామీల అమలుకు పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు రక్షణ కోసం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన పోరాటం చేపట్టనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు రక్షణ కోసం అనేక హామీలు ఇచ్చిందన్నారు. వంద రోజులవుతున్నా వాటిని అమలు చేయలేదని ధ్వజమెత్తారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, కేవై.రాజా, వైఎస్.మణి, పురుషోత్తంరెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

శంకరన్ సేవలు చిరస్మరణీయం


సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

తిరుపతి కల్చరల్ : వెట్టి చాకిరి విముక్తి ప్రదాత, దళిత, ఆదివాసి, బడుగు వర్గాల పక్షపాతి వందలాది మంది ఐఏఎస్ అధికారులకు స్ఫూర్తినిచ్చిన ఎస్ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో శంకరన్ 90వ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తి పి.గురప్ప, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, అంబేడ్కర్ భవన్ కార్యదర్శి నాగేశ్వరరావు, అధ్యక్షుడు పరమశివన్, భారతీయ దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ధనశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నం కాళయ్య, బీసీ సంఘర్షణ సమితి నాయకులు సాకం ప్రభాకర్, అక్కినపల్లి లక్ష్మయ్య, బీసీ.కేశవులు పాల్గొని ప్రసంగించారు. ఐఏఎస్ అధికారిగా ఎస్ఆర్ శంకరన్ పేద ప్రజల సంక్షేమం, సమాజ అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఆయన విగ్రహం నెలకొల్పేందుకు తిరుపతిలో స్థలం కేటాయించాలని కోరారు.

ఆకట్టుకున్న ‘మన సంస్కృతి’


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : వయో వృద్ధులకు అందించే ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం నగరంలో మన సంస్కృతి కళాబృందం చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాల నడుమ పాటలతో ఆర్టీసీ బస్టాండ్, రుయా ఆస్పత్రి, ఎమార్మర్‌పల్లె సర్కిల్ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కళాకారులు రెడ్డెప్ప, గంగులమ్మ, దొరస్వామి పాల్గొన్నారు.

‘లైవ్ షో’పై విద్యార్థుల నిరసన



స్టేడియం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు, వీసీకి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ విలువలను తగ్గించే లైవ్ షోకు వెంటనే అనుమతులు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఎస్వీయూ స్టేడియం వద్ద నిరసనకు దిగారు. ధనార్జనే ధ్యేయంగా అధికారులు వర్సిటీని వ్యాపారులకు తాకట్టు పెట్టి విద్యార్థుల, ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. లైషోకు బయట వ్యక్తులు మద్యం, మత్తు పానీయాలు సేవించి హాజరై విద్యార్థినుతో అసభ్యంగా ప్రవర్తించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జంగంరెడ్డి కిషోర్ దాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, నాయకులు చిన్నా, కొండా రమణారెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

కచ్చితంగా అడ్డుకుంటాం

ఎస్వీయూ స్టేడియంలో కార్తీక్ లైవ్‌షోను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి కచ్చితంగా అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసే ఇటువంటి కార్యక్రమాలలో అసభ్యకరమైన పాటలు, మహిళలను కించపరిచే చేష్టలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీలోకి బయట వ్యక్తులు వచ్చే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలు రాజ్యమేలుతాయని మండిపడ్డారు. వర్సిటీ అధికారుల తీరుపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, నాయకులు అశోక్, వినోద్, నరేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

భీష్మయ్య నాయుడికి నివాళి


నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి

చంద్రగిరి : టీటీడీ విశ్రాంత హెల్త్ అధికారి డాక్టర్ భీష్మయ్యనాయుడు సోమవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం శేషాపురానికి వెళ్లి భీష్మయ్యనాయుడి భౌతిక కాయానికి సినీ నటుడు రఘుబాబుతో కలిసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సైతం భీష్మయ్య పార్థివదేహానికి అంజలి ఘటించారు.

పేదలకు న్యాయం చేయాలని వినతి

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న పేదలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ టీటీడీ పరిపాలన భవనం ఎదుట 62 రోజులుగా సమస్య పరిష్కారం కోసం నిరసన దీక్షలు చేస్తున్నారని వెల్లడించారు. 31 కుటుంబాల వారు సుమారు 15 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వెళుతున్న శ్రీవారి భక్తులకు అన్నపానీయాలు అందిస్తున్నారన్నారు. ఇప్పుడు ఆ పేద కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈఓ స్పందించి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర శ్రీవారి మెట్టు వ్యాపారుల సంఘం నేతలు మధు, చిట్టిబాబు, యుగంధర్ పాల్గొన్నారు.

‘వెలుగుపూల కోసం’ ఆవిష్కరణ

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ రమేశ్‌కుమార్ రచించిన వెలుగుపూల కోసం కవితా సంపుటిని ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసులురెడ్డి, మదనపల్లె బీటీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డి.శ్రీనివాసులు పుస్తకంలోని కవితలను విశ్లేషించారు. కార్యక్రమంలో ఐరాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డిరామరాజు, పాకాల బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, అధ్యాపకుడు ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

మత్తుతో జీవితమే చిత్తు


మాట్లాడుతున్న జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు

తిరుపతి ఎడ్యుకేషన్ : యువత మత్తుకు బానిసై జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు నారాయణరెడ్డి, మంజుల తెలిపారు. మంగళవారం స్థానిక టీపీపీఎం హైస్కూల్ లో నెహ్రూ యువజన కేంద్రం సహకారంతో ప్రజా సాధికారిక ట్రస్టు ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం–దుష్పరిణామాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, అభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మేధస్సు, నైపుణ్యంతోనే ఎంచుకున్న రంగాల్లో రాణించగలరని వెల్లడించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడిన యువత చెడు మార్గంలోకి వెళుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వాడకానికి అలవాటు పడి పెడదారి పడుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ రాంబాబు, ట్రస్టు అధ్యక్షుడు బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

సాగునీటిని అడ్డుకోవడంపై ఫిర్యాదు

భాకరాపేట: రొంపిచెర్ల మండలంలోని చల్లంపల్లె ప్రాజెక్టు తలుపులు ధ్వంసం చేసి, కాలువకు సాగునీరు రాకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని యల్లంమంద పంచాయతీ రైతులు కోరారు. మంగళవారం ఈ మేరకు ఎర్రావారిపాళెం ఎస్ఐ ఎర్రిస్వామికి ఫిర్యాదు చేశారు. తలకోన అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు కాలువలోకి రాకుండా మట్టి వేయడంతో చెరువులు నిండే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నప్రసాద కేంద్రంలో తనిఖీలు


సహపంక్తి భోజనం చేస్తున్న అదనపు ఈఓ

తిరుమల : తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. భోజనం రుచి, నాణ్యత గురించి భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

తిరుపతి(అలిపిరి): శ్రీవారి దర్శనానికి నడిచి వెళ్లే భక్తుల లగేజీని అలిపిరి శ్రీవారి మెట్టు మార్గం నుంచి తిరుమలకు భద్రంగా చేరుస్తున్న సుమారు 350 మంది కార్మికులకు వేతనాలు పెంచాలని బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ ఈఓకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కార్మికులు నెట్టుకొస్తున్నారన్నారు. వారిని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ సంస్థలో విలీనం చేసి జీతాలు పెంచాలని కోరారు.